# స న్యా సి

శ్రీ కృష్ణమూర్తి పట్నాయక్

చేత కమండలం పట్టుకొని, వ్యాఘ్రచర్మం వెనుకను కట్టుకొని, జటాధారియైన ఒక సన్యాసి శెట్టి యింటిముందు నిల్చున్నాడు తెల్లవారున.

శెట్టిగారి నౌకరు చూచి పిడికెడు బియ్యం తీసుకెళ్ళి—'ఇదండి బాబుగారూ బియ్యం' అన్నాడు.

"వద్దు, అబ్బీ, నాకు భిక్ష అక్కరలేదు. సూర్యగ్రహణస్నానానికి కాశీ వెళ్లాలని వుంది ఒక్క నాలుగురోజులు మాత్రమే గడువున్నది. లేకుంటే నడిచే వెళ్ళియుండును. కనుక శెట్టిగారికి పుణ్యం వుంటుంది. ఒక మూడోతరగతి టికెట్ యిప్పించాలని చెప్పు."

నౌకరు సన్యాసిమాటలు వినగానే చాచిన చేతిని ముడిచి ఆశ్చర్యంతో చూడసాగాడు

"ఏమిటి చూస్తున్నావు అబ్బీ? వెళ్లు; శెట్టిగారితో నా మాటలు చెప్పు."

శెట్టి కాలకృత్యాలు, పూజాపునస్కారాలు ముగించి తన ఆసనంలో కూర్చున్నాడు. నౌకరు వెళ్ళి—"బాబుగారూ, ఒక సన్యాసి......"

మధ్యలోనే అతనివైపు తీక్షణంగా చూస్తూ శెట్టి—"అయితే దానిగురించి నాతో ఆడాల్సిన సంగతేముంది? వెళ్ళి భిక్షవేసేయ్" అన్నాడు.

నౌకరు పిడికిలిలోవున్న బియ్యాన్ని చూపించి-"భిక్ష ఇయ్యడానికే వెళ్లాను, కానీ అతడు పుచ్చుకోలేదు. కాశీకి టికెట్ కావాలంటున్నాడు" అని చెప్పాడు.

"టికెట్! పో, భిక్ష తీసుకున్నట్లయితే తీసుకోమను, టికెట్ గికెట్ యేమీ దొరకదు" క్రోధంతో తీక్షణ వీక్షణాలతో అన్నాడు శెట్టి.

నౌకరు వచ్చి సన్యాసితో శెట్టిమాటలు విశదీకరించాడు.

"ప్చ్!......అయితే అబ్బాయీ సాధువులు, సన్యాసులు అందరిముందు నోరువిప్పి అడగడానికి అగత్యంలేదు; అడగరు. అవశ్యమైనప్పుడు ఒక్కరి యెదుటే తమ కాంక్షను తెల్పి దాన్ని నెరవేర్చుకొని మరలుతారు. ఇలా మీ శెట్టిగారితో చెప్పు" అన్నాడు సన్యాసి.

నౌకరు మళ్లాడు యీ సంగతి శెట్టితో చెప్పగానే—"ఒరేయ్! నీవు వెళ్ళరా, నీ పని నీవు చూసుకో. ఇలాంటి యిలాంటి తొమ్మిదివందల తొంభై మంది సాధువుల్ని, సన్యాసుల్ని చూశాను!" అని గసిరాడు అతడు.

మళ్లాడు తనపనిమీద వెళ్ళిపోయాడు. సన్యాసి ముంగిట నిల్చేవున్నాడు. శెట్టి ఒకమారు పనిమీద బయటకు వచ్చినా సన్యాసివైపు చూడలేదు, సన్యాసికూడా అతడితో మాటాడలేదు.

మధ్యాహ్నమైంది, సాయంకాలమైంది, రాత్రయింది. తెల్లవారూ అయిపోయింది. సన్యాసి ఆ విధంగానే నిల్చుని వున్నాడు వచ్చీ వెళ్లే జనం ఇరవై నాలుగుగంటలముందుకూడా సన్యాసి అలానే నిలుచునివుండడం చూసియుండిరి. ఇదేమీ అని స్వభావసిద్ధంగా వారికి కుతూహలం కలిగింది. ఒకగుంపుగా సన్యాసివద్ద మూగారు, ఈ గుంపువార్త నౌకరు చెప్పగానే శెట్టి బయటకొచ్చాడు. సంగతేమని అడుగుతే చెప్పడంలేదు సన్యాసి. అంతేత శెట్టి రాగానే అతన్ని అడిగారు అక్కడి మనుష్యులు, టికెట్ విషయం

చెప్పాడు శెట్టి దానితో వారు—"ఇచ్చెయ్యండి శెట్టిగారూ! ఏముంది ఒక టిక్కెట్టులో! పాపం ఇరవై నాలుగు గంటలు నిలుచున్నాడు" అన్నారు.

"ఇదేమిటీ సన్యాసి!" అనుకొని ఒక మూడో తరగతి టిక్కెట్ తెప్పించి అందరియెదుట సన్యాసికి అందించాడు శెట్టి.

సన్యాసి టిక్కెట్ వైపు చూచి "ప్చ్!...... అబ్బాయీ, మూడోతరగతి పెట్టెలో యీ రోజుల్లో నిల్చునే ప్రయాణం చేయవలసివస్తోంది. నీ ముంగిట ఇరవై నాలుగుగంటలూ నిలుచునీ, నిలుచునీ, నా కాళ్లు యెంతగా వాచిపోయినై అంటే, ఒక్కక్షణమైనా మరి నిలువలేవు. ఇప్పుడు కూర్చునే ప్రయాణం చేయగలను అంచేత ఇంటరుక్లాసు టిక్కెట్టు యిప్పించండి" అని ఎక్కడ నిల్చునివుండెనో అక్కడే కూర్చుండిపోయాడు.

"ఈ మాటలు విని శెట్టి మండిపోయాడు. చూసే సన్యాసి, యింటరులో ప్రయాణం చేస్తాడు! తీసుకుంటే తీసుకో యిది, లేకుంటే పో" అని పురిమి టిక్కెట్ వాపసుచేయడానికి పంపించి తన ఆసనంలో కూర్చున్నాడు. గుంపుకూడా యిక అంటూ మాయమైంది.

సన్యాసి అలాగే అక్కడే కూర్చున్నాడు. మరలా మధ్యాహ్నం అయింది, సాయంకాలమైంది, రాత్రిఅయింది తెల్లవారుకూడా అయిపోయింది. జనం గుంపు మళ్లా సన్యాసివద్ద హాజరయింది.

"పెద్దహఠం గల సన్యాసిరా!" అన్నారు ఒకరు.

"గొప్ప మహాత్ముడురా!" అన్నారు యింకొకరు.

"వీడా సన్యాసి! మాయజగాలమారిరా!" అన్నారు మరొకరు.

శెట్టి బయటకు రాగానే విన్నవించారు—"శెట్టిగారూ! ఇంటరుది యిచ్చెయ్యండి! నలభైయెనిమిదిగంటలనుండి ఆకలిదప్పులతో పడున్నాడు!"

కోపం అణచుకోలేక అణచుకొని యింటరు టిక్కెట్ తెప్పించి—"ఇదుగో బాబూ! నీ మాటే నిలచింది. ఇక యీ ముంగిలి విడు" అన్నాడు శెట్టి.

సన్యాసి టిక్కెట్ వైపు చూచి—"ప్చ్!...... అబ్బాయీ, ఇంటరుక్లాసులో యీ రోజుల్లో కూర్చునే ప్రయాణం చేయవలసివస్తోంది. నీ ముంగిట యిరవై నాలుగుగంటలు కూర్చుని కూర్చుని యిప్పుడు నాలో అరనిమిషమైనా కూర్చొనడానికైనా శక్తిలేకపోయింది. ఇప్పుడు పడుకొనే ప్రయాణం చేయగలను. అంచేత నీ విప్పుడు ఫస్టుక్లాసు టిక్కెట్ యివ్వు!" అని అక్కడే పడుకొనిపోయాడు.

శెట్టి కోలుకొని టిక్కెట్ వాపసు చేయించి సణుగుకూ తన ఆసనంపైని వెళ్ళి కూర్చున్నాడు. ప్రజకూడా గొణుక్కుంటూ పోయింది.

సన్యాసి ఆ తరహాగా నేపడివున్నాడు. మధ్యాహ్నమైంది. సాయంకాలమైంది, రాత్రయింది, తెల్లవారుకూడా అయిపోయింది!! మరలా జనులు పోగైనారు.

"ఇటువంటి విచిత్రమైన సన్యాసిని యెక్కడా మేము చూడలేదు!" అందరూ అంటున్నారు. శెట్టి యెప్పుడైతే వచ్చాడో మళ్లా అందరన్నారు.

"శెట్టిగారూ ఫస్టుక్లాసు తరగతిది సైతం యిప్పించివేయండి. లేకుంటే ప్రాణాన్ని సైతం యిక్కడే యిచ్చేస్తాడు!"

శెట్టి కోపం హద్దుమీరిపోయింది, అయినా ఏం లాభం? ఎలాగో అణచుకొని ఫస్టుక్లాసు టిక్కెట్టు తెప్పించి "తీసుకోండి స్వామీ, మూటకట్టు! ఇక వెళ్లండి, నమస్కారాలు!" అన్నాడు.

సన్యాసి నిలుచుని టిక్కెట్టు పుచ్చుకొని రెండు చేతులతో దాన్ని చించి ముక్కలు చేసేసి శెట్టి ముఖంమీద విసరికొట్టాడు "ఇప్పుడు టిక్కెట్టు ఎందుకు? ప్రయాణం చూస్తే యీనాడే. కాశీ యీ రోజే యెలా చేరుకోగలను?" అంటూ బలహీనమైన కాళ్లను మెల్లగ లేవదీస్తూ అక్కడనుండి మెల్లగ వెళ్ళిపోయాడు!!

అందరూ విచిత్రంగా అతడివైపు చూస్తూ వుండిపోయారు తెల్లబోతూ!!

---

ఆనందవాణి *